చెరువుల్లోకి చేప పిల్లలు



- టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- జిల్లాలో 2,950 మంది మత్స్యకారులు
- సెప్టెంబరు రెండో వారంలో వదలనున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువుల్లో చేపపిల్లలు వదిలేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీపై నెలకొన్న అనుమానాలకు తెరపడింది. ఈ ఏడాదిలో చేపపిల్లల పంపిణీ నిమిత్తం అవసరమైన టెండర్ ప్రక్రియ కొద్ది రోజుల క్రితం ప్రారంభమైంది. మొత్తంగా ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ ఉంటుందా, ఉండదా అన్న అనుమానాలకు తెరపడింది. ఈ నెలాఖరు నాటికి టెండర్ ప్రక్రియ ముగిసి, సెప్టెంబరు రెండో వారంలో ప్రాజెక్టులు, చెరువులలో చేపల సీడ్‌ను వదిలేలా మత్స్య శాఖ అదికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులలోకి 1.44 కోట్ల వరకు సీడ్‌ను వదలనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

● ఈ ఏడాది ఆలస్యం..

ఈ ఏడాది చెరువులో చేపల విడుదల ఆలస్యమైంది. సాధారణంగా జూలైలో టెండర్లు ఆహ్వానించి ఆగస్టులో చేపపిల్లలను వదులుతారు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం సకాలంలో బడ్జెట్ కేటాయింపు జరుగక పోవడం వల్ల ఆలస్యమైంది. ఈనెల 20 న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. 35ఎంఎం నుంచి 40 ఎంఎం సీడ్‌కు రూ. 62 పైసలు, 80ఎంఎం నుంచి 100 ఎంఎం సీడ్ రూ. 1.65 పైసలు రేటుగా నిర్ణయించి టెండర్లు ఆహ్వానించారు. సెప్టెంబరు 1న టెండర్లు ఓపెన్ చేసి కాంట్రాక్టర్‌ను ఖరారు చేయనున్నారు. ఆ తర్వాత సెప్టెంబరు రెండో వారంలో సీడ్‌ను వదిలేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

టెండర్ ప్రక్రియ ప్రారంభం..



\- సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఈ ఏడాది చేపల సీడ్ వదిలేందుకు అవసరమైన టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబరు 1 నాటికి టెండర్ ఓపెన్ చేస్తారు. జిల్లాలో సెప్టెంబరు రెండో వారంలో చేపల సీడ్‌ను వదిలేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలోని ఆయా చెరువులు, ప్రాజెక్టులలో ఈ ఏడాది 1.44 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు నిర్ణయించాం.

● జిల్లాలో 74 మత్స్యకార సంఘాలు..

జిల్లాలో 74 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 2,950 మంది మత్స్యకారులున్నారు. ఈ కుటుంబాలకు చేపలు, రొయ్యల పెంపకం, విక్రయించడమే జీవనాధారం. జిల్లాలో 261 చెరువులు, 4 ప్రాజెక్టులు, 11 పెద్ద చెరువులు ఉన్నాయి. వీటిలో ఏటా మత్స్యశాఖ అందించే చేపల, రొయ్యల సీడ్‌ను వదిలి పెంచుతున్నారు. ఇదిలా ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018-2019లో తీసుకువచ్చిన సమీకృత మత్స్య అభివృద్ధి పథకంతో మత్స్యకారులకు రూ. 2 కోట్లు విలువ చేసే ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఫోర్ వీలర్‌లు, ట్రేలు, ఐస్‌బాక్స్‌లు, వలలు, ఎలక్ట్రానిక్ కాంటాలు అందించారు.

అధికారులు విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వాంకిడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో అవకతవకలపై అధికారులు విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకులు సతీష్‌బాబు, గోవిందరావు డిమాండ్ చేశారు. వాంకిడి మండలంలో ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు చేస్తున్న అమరణ నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు సతీష్‌బాబు, గోవిందరావు దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలను పక్కన పెట్టి వాంకిడి మండలంలో కాంగ్రెస్ నాయకులు బంధువులకు, కమిటీ సభ్యులకు ఇండ్లు మంజూరు చేయడం సమంజసం కాదన్నారు. ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, మారుతి, వికాస్, అక్షయ్, గణేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హరియాణా రాష్ట్రంలోని సుభాష్ చంద్రబోస్ స్టేడియంలో ఈ నెల 28 నుంచి 31 వరకు నిర్వహించే 4వ ఫాస్ట్ ఐదో నెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు ధనుర్కర్ శాలిని, జుంగరి నిహారికకు మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు అలీబీన్ అహ్మద్, కార్యదర్శి తిరుపి, రవీందర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నార్నూర్ మండలం తాడిహత్నూర్ గ్రామానికి చెందిన విద్యార్థి రాథోడ్ అలేఖ్య ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఆర్) ఆల్ ఇండియా ర్యాంక్ టాప్ ఐదులో సీటు సాధించడంతో మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు కిషన్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

దహెగాం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో రామకృష్ణ రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియా వాడటం వల్ల ఖర్చు తక్కువగా ఉంటుందన్నారు. సాగు విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయశాధికారులను సంప్రదించాలన్నారు.కార్యక్రమంలో ఏఈఓలు వంశీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో విద్యార్థి మృతి

విధులను నిర్లక్ష్యం చేశారని ఇద్దరు ఉద్యోగులపై వేటు



అనురాగ్(ఫైల్)

తిర్యాణి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగిడి మాదర గిరిజన ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఆత్రం అనురాగ్(11) అనే విద్యార్థి డెంగీ జ్వరంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. అనురాగ్‌కు ఈ నెల 15న తీవ్ర జ్వరం రావడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తిర్యాణి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మూడు రోజుల పాటు చికిత్స అందించినా జ్వరం తగ్గలేదు. వైద్య సిబ్బంది సూచన మేరకు 19న మంచిర్యాల ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డెంగీగా నిర్ధారణ అయింది. వైద్యుల సూచన మేరకు బాలుడిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

● ఇద్దరు ఉద్యోగులపై వేటు..

అనురాగ్ డెంగీతో మృతి చెందడంతో విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగులపై వేటు వేస్తూ మంగళవారం ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పంగిడిమాదర గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగర్‌ను సస్పెండ్ చేయగా, ఏఎన్ఎం సువార్తను విధుల నుంచి తొలగిస్తూ పీవో ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి ఆరోగ్యంపై ప్రధానోపాధ్యాయుడు, ఏఎన్ఎం ఎలాంటి సమాచారం ఇవ్వలేదని గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి తెలిపారు. సమాచారం తెలిస్తే కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించే వారమని చెప్పారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆశ్రమ పాఠశాల వద్ద రెబ్బెన సీఐ, తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆశ్రమ పాఠశాలకు ఆర్డీవో లోకేష్ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతి చెందిన విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. ఆయన వెంట ఏటీడీవో చిరంజీవి ఉన్నారు.

పశువుల యజమానులకు నోటీసులు

సిర్పూర్(టి), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని పలువురు పశువుల యజమానులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు అందజేశారు. రోడ్లపై పశువులు తిరగడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడు తుందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నోటీసుల్లో తెలియజేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

వాంకిడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గౌరవ డాక్టరేట్ అవార్డు అందున్న ఉపాధ్యాయడు వడ్లూరి రాజేష్‌ను మంగళవారం మండల కేంద్రంలోని సన్‌షైన్ మోడల్ స్కూల్‌లో సన్మానించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాజేష్ మేజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మ్యాజిక్ అండ్ యూనివర్సిటీ ఫరీదాబాద్ హరియాణ వారు గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేష్, ఉపాధ్యాయులు రవి, ప్రశాంత్, మమత, కిరణ్మయి, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం వచ్చి సొమ్మసిల్లిన మహిళ

బెజ్జూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎరువుల కోసం వచ్చిన ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోవడంతో అక్కడ ఉన్న ఆందోళన చెందారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘానికి మంగళవారం లారీ లోడు యూరియా వచ్చింది. ఎరువుల కోసం బెజ్జూరుకు చెందిన లెండుగూరి కాసుబాయి అక్కడికి వచ్చింది. కాసుబాయికి నాలుగు ఎకరాల పంట భూమి ఉంది. ఎరువుల కోసం క్యూలో ఉన్న సమయంలో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయింది. యూరియా కోసం వచ్చిన రైతులు ఆందోళనకు గురై వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు సపర్యలు చేయడంతో ఆమె తేరుకున్నది. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో ఇలా పడిపోతు ఉంటుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పెంచికలపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎర్రగుంట గ్రామానికి చెందిన ఆత్రం పోశన్న కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం పరామర్శించారు. రూ. ఐదు వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట తిరుపతి, మల్లయ్య, బండు, చలం, నారాయణ ఉన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి మంగళవారం కాంగ్రెస్ నాయకులు రూ.6 వేల ఆర్థిక సహాయంతో పాటు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, శ్రీనివాస్, చంద్రమౌళి, శంకర్‌గౌడ్, ఇస్మాయిల్, రమేష్, గంగారాం, రఘునాథ్, మల్లయ్య, కిషన్‌రావు, సాజిత్, తిరుపతి, వెంకటేష్, బుచ్చన్న, కమలాకర్, బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

సిర్పూర్(టి), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం భూపాలపట్నంకు చెందిన బూరం వెంకటేష్, చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన పొట్టె సంతోష్ రోడ్డు ప్రమాదంలో గాయ పడి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని ఆయన వైద్యులకు సూచించారు.

విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలి



విద్యార్థులకు కంప్యూటర్ విద్యను బోధిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

సిర్పూర్(టి), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రోజు గంట పాటు కంప్యూటర్ విద్యను అందించాలని ఇన్‌చార్జి డీఈవో, అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వసతుల కల్పన, మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ విద్య తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతి రోజు గంట పాటు కంప్యూటర్ విద్యను బోధించాలన్నారు. ఈ సందర్భంగా స్వయంగా విద్యార్థులకు కంప్యూటర్ విద్యను బోధించారు. అలాగే మధ్యాహ్న బోజనంను పరిశీలించి బోజన విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వంత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఇంకుడు గుంతకు భూమి పూజ చేశారు. ఇంకుడు గుంతలు నాణ్యంగా నిర్మించాలని సూచించారు. అనంతరం లోనవెల్లి పీహెచ్ సీను సందర్శించి అక్కడ వసతులు, ఆసుపత్రిలో రోగులకు ఏర్పాటు, మందుల నిలువలను అడిగి తెలుసుకున్నారు. విధులను పకడ్బందీగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో వేణుగోపాల్‌రావు, ప్రధానోపాధ్యాయులు సదాశివుడు, సీఆర్పీ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



చింతలమానేపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై నరేష్

చింతలమానేపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో మంగళవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రినిధులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవడంతో పాటు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ప్రతి వినాయక మండలి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని ఎలాంటి అవాంచీనయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దౌలత్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శులు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని తహసీల్దార్ రామ్మోహన్, సీఐ సంతోష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముస్లి శాంతి కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ గౌరి శంకర్, ఎస్సై సర్తాజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉత్సవ కమిటీ, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారం వేడుకలు నిర్వహిచుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సై అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై విజయ్‌లు అన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై రామకృష్ణ కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన శాంతి కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వేడుకలు నిర్వహించాలని సూచించారు. నిబంధనల ప్రకారం మండలీల సభ్యులు నడుచుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో క్రిష్టారావ్, తహసీల్దార్ ప్రహ్లద్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్, గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావ్, కమిటీ సభ్యులు అనిల్, అక్తర్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతుల ప్రతిష్ఠ

● పర్యావరణ హితమే ధ్యేయమని చెబుతున్న గ్రామస్థులు



మట్టితో తయారు చేసిన గణనాథుడు

జైనూర్, ఆగస్టు 26: (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామం లేండిజాల గ్రామానికి చెందిన ఆదివాసీలు 62 ఏళ్ల నుంచి మట్టి గణపతులనే ప్రతిష్ఠిస్తూ పూజలు చేస్తున్నారు. వినాయక ఉత్సవాలు వచ్చాయంటే ఊరు వాడ పల్లె పట్నం అనే తేడా లేకుండా ఇప్పుడు ఎక్కడ చూసిన గణపతులు కొలువు దీరుతాయి. ఆది దేవుడిగా పూజించే వినాయకుడు పూర్తిగా ప్రకృతి ప్రేమికుడు. పూలు, పండ్లు, పత్రాలు, మట్టితో చేసిన వాటిని ప్రతిష్ఠించి పూజిస్తేనే శ్రేష్ఠమని పండితులు చెబుతున్నారు. అధునాతన సమాజంలో హంగు ఆర్భాటాల కోసం నేటి యువత రసాయనాలతో తయారు చేసిన విగ్రాహలపై వేపే మొగ్గు చూపుతున్నారు. ప్లాస్టర్ అఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. కానీ జైనూర్ మండలంలోని లేండిజాల గ్రామానికి చెందిన గిరిజనులు మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తమ పూర్వికులు చెప్పిన మాట ప్రకారం 62 ఏళ్లుగా మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. గ్రామస్థులు కలిసి కట్టుగా నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భజన గీతాలు పాడేందుకు తీసుకున్న సంగీత వాయిద్యాలను ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. కానీ ఆ గ్రామానికి చెందిన ప్రజలు ఇప్పటికి చెక్కు చెదరకుండా కంటికి రెప్పలా భద్రంగా ఉంచుతున్నారు. రూ. 60కే హార్మోనియం, రూ.40 కి తబలా తీసుకున్నారు. ఇప్పటికీ వాటినే వినియోగిస్తుండడం గమనార్హం.

దాతల సహకారం అభినందనీయం

పెంచికలపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి దాతల సహకారం అభినందనీయమని సీఐ కుమారస్వామి అన్నారు. మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థి కొడప నవదీప్ పాముకాటుతో గత గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబానికి చేయూత నివ్వాలని గ్రామ యువకులు సోషల్ మీడియా ద్వారా కోరగా 128 మంది దాతల సహకారంతో రూ.50 వేలు దాతృత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం దాతల సహకారంతో అందిన రూ.50 వేలను విద్యార్థి తల్లి కొడప సులోచన పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను సీఐ కుమారస్వామి అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై అనీల్‌కుమార్, రాజన్న, భుజంగరావు, ఖలీల్‌బేగ్, రాజాగౌడ్, సాయి కుమార్ గౌడ్, తిరుమలగౌడ్, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఈజేఏసీ కో చైర్మన్‌గా శాంతికుమారి


శాంతికుమారి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన టీజీఈజేఏసీ కోచైర్మన్‌గా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, వైస్ చైర్మన్‌గా ఊశన్నను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు హిందురావు, ఉపాధ్యక్షురాలు ప్రీతి, కోశాధికారి రమేష్, జిల్లా బాధ్యులు హేమంత్‌షిండె, రాజ్‌కమలాకర్‌రెడ్డి, మోహపతిరావు, దుర్గయ్య, మహిపాల్, సుభాష్, నవీన్, రవికుమార్ అభినందించారు.



సమస్యల తిష్ఠ

- కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు
- రోజు 50కిపైగా రైళ్ల రాకపోకలు

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-నార్త్ ఇండియాను కలిపే ముఖ్యమైన కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు పేరుకుపోయాయి. ఏడాది కాలంగా థర్డ్ లైన్ పనులు బెల్లంపల్లి- కాగజ్‌నగర్ మధ్య కొనసాగుతుండడంతో నెలల తరబడి ప్యాసింజర్ రైళ్లు తరుచూ రద్దు అవుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరోనా సమయంలో నిలిపివేసిన నాగ్‌పూర్ (అజ్ని)- ఖాజీపేట ప్యాసింజర్ రైలు ఇంత వరకూ తిరిగి ప్రారంభం కాలేదు. కాగజ్‌నగర్ నుంచి హైద్రాబాద్, వరంగల్, ఖాజీపేట వైపు వెళ్లేందుకు తెల్లవారుజామున 3.30కు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఉంటుంది. తర్వాత ఉదయం పూట నుంచి మధ్యాహ్నం వరకు రైల్లు లేవు.

ఖాజీపేట-అజ్ని ప్యాసింజర్ రైలు ఉదయం 5.30కు ఉండేది. దీంతో ప్రయాణికులకు వెసులుబాటుగా ఉండేది. దీనిని పునఃప్రారంభించాలని కోరుతున్నా మొదలు కాలేదు. భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ తర్వాత సికింద్రాబాద్ వైపు రైలును నడిపించాల్సి ఉంది. అలాగే ప్లాట్ ఫాం 2,3లో నూతనం నిర్మించినప్పటికీ షెడ్లు పూర్తి స్థాయిలో లేక పోవడంతో వానాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం వరకైనా పూర్తి స్థాయిలో షెడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. అలాగే ప్లాట్ ఫాంలో మరుగుదొడ్లు, తాగునీరు, లిఫ్ట్ సౌకర్యం, బుకింగ్ కౌంటర్ లేక పోవడంతో 1వ ప్లాట్‌ఫాంలోకి వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్లాట్‌ఫాం 2,3లో ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు వేయాల్సి ఉంది. ఆయా సమస్యలపై రైల్వే యాత్రి సేవా సమితి కాగజ్‌నగర్ అధ్యక్షుడు ప్రయాగ్ తివారీ, పీఆర్‌వో పవన్ బల్దీవా, తదితరులు పలుమా ర్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు.

గత నెలలో వచ్చిన దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షి యల్ మేనేజర్ సుచిత్రరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు చర్లపల్లిలో రైల్వే శాఖ మంత్రికి కూడా వందే భారత్ రైలు కాగజ్‌నగర్ హాల్టింగ్ తదితర సమస్యలపై ఎమ్మెల్యేతో కలిసి విన్నవించారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రయాణికులతో పాటు ముఖ్యంగా కౌటాల, బెజ్జూరు, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికలపేట, దహెగాం మండలాలోని ఆయా గ్రామాల నుంచి హైదరాబాద్, వరంగల్ వైపు ఆసుపత్రులు, ఇతరత్ర పనులకు నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. కాగజ్‌నగర్‌కు వచ్చే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా వస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రైళ్ల సమయ పాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వినతిపత్రాలు ఇస్తున్నా..

సికింద్రాబాద్ లేదా చర్లపల్లి, కాగజ్‌నగర్ మీదుగా హౌరా వెళ్లేం దుకు రైలు కోసం వినతి పత్రాలు ఇస్తున్న పట్టించుకోవడం లేదు. కేరళ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై-జోద్‌పూర్, వందే భారత్ రైళ్ల హాల్టింగ్ కోసం కూడా పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఇంకా నోచుకోలేదు. నిత్యం కాగజ్‌నగర్ మీదుగా 50కి పైగా రైళ్లు ఢిల్లీ, చెన్నై, సికింద్రాబాద్ వైపు వెళుతుంటాయి. రాష్ట్ర సరిహద్దులోని రైల్వే స్టేషన్‌తో పాటు జిల్లాలోని ఏకైక పెద్ద స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

వినతిపత్రాలు అందించాం..
ప్రయాగ్ తివారి, రైల్వే యాత్రి సేవా సమితి అధ్యక్షుడు

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్క రించాలని గతంలో నుంచే వినతిపత్రాలు ఇస్తు న్నాం. పలు సమస్యలు పరిష్కారం అయ్యాయి. ఇంకా పలు రైళ్లు నిలుపుదల చేయాలి. ముఖ్యంగా వందే భారత్, కేరళ, తదితర ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగాల్సి ఉంది. ప్లాట్ ఫారంపై ఇంకా పలు సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఇటీవల రూ. 9 కోట్లు మంజూరు కావడం శుభ పరిణామం.


రైల్వే మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు (ఫైల్)

చికిత్సపొందుతూ ఒకరి మృతి

భీమారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భీమారంలోని ఐటీడీఏ కాలనీకి చెందిన మారం చందు (42) మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా చందు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 25న మద్యం మత్తులో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. చందుకు భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నస్పూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం సుందరయ్య కాలనీ సమీపంలోని నందనవనం పార్కు వెనుక చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్న స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులు కలిసి మూడు ముక్కలాట ఆడుతుండగా పట్టుకున్నామని ఎస్సై ఉపేందర్ రావు తెలిపారు. వారి వద్ద నుంచి పేక ముక్కలతో పాటు రూ. 64,400 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంకులకు భద్రత ఏదీ..?

ఎస్‌బీఐ స్కామ్ సంఘటనతో అప్రమత్తమైన ఖాతాదారులు

చెన్నూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు చిట్టీ వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, భూస్వాముల వద్ద తనాఖా పెట్టడం లాంటి అంశాలతో ప్రజలు భారీగా మోసపోయినఘటనలు ఉండేవి. ఆ తర్వాత ప్రైవేటు ఫైనాన్స్‌లు, చిట్‌ఫండ్‌లు, ప్రైవేటు బ్యాంకులు కోట్లాది రూపాయలను దండుకుని బోర్డులు తిప్పేసిన ఘటనలు సైతం కోకొల్లలు. తాజాగా చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంకులో బంగారంతో పాటు నగదు స్వాహా కావడంతో బ్యాంకులకు భద్రత లేదని, ఇకపై బ్యాంకులను నమ్మడం ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో అధికంగా వ్యవసాయం చేసే రైతు కుటుంబాలు ఉండడంతో పాటు చిన్న చిన్న దుకాణాలు, వ్యాపారులు ఉన్నారు. రైతు పెట్టుబడికి ప్రైవేటు వ్యక్తుల వద్దకు వెళితే అధికంగా వడ్డీ చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో బ్యాంకుల్లో తక్కువ వడ్డీకి బంగారాన్ని తనాఖా పెట్టి రుణాలను తీసుకుంటున్నారు. చిన్న చిన్న వ్యాపారులు సైతం ఇదే పద్ధతిలో నడుస్తున్నారు. కానీ బ్యాంకుల్లో పెట్టిన బంగారం బ్యాంకు అధికారులే స్వాహా చేస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. చెన్నూరు ఎస్‌బీఐ 2లో జరిగిన స్కామ్‌లో 402 మంది ఖాతాదారులకు చెందిన బంగారం మాయం కాగా ఇందులో సుమారు 300 మంది రైతులు, చిన్న చిన్న వ్యాపారాలు, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కావడం గమనార్హం. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో బంగారం తనాఖా పెడితే దానికి భద్రత ఉండదనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో తనాఖా పెడితే నిలువు దోపిడి జరిగిందని వాపోతున్నారు. తక్కువ వడ్డీకి రుణం తీసుకుని వ్యవసాయం సాగు , వ్యాపారం చేసుకుని జీవిద్దామనుకుంటే అసలుకే ఎసరు వచ్చిందని ఇకపై ఇలాంటి బ్యాంకులను నమ్మడం ఎలా అని పలువురు వాపోతున్నారు.

రిక్షాకాలనీలో కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న సీఐ ప్రేంకుమార్

కాగజ్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని రిక్షాకాలనీలో మంగళవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రేంకుమార్ మాట్లాడుతూ నేరాలపై నియంత్రించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీసులు ఎల్లవేళలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. శాంతిభద్రతల పరిక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. సైబర్ నేరాలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యా ంకుకు సంబంధించిన వివరాలు ఎవరికి కూడా చెప్పవద్దని సూచించారు. అనంతరం లైసెన్సులు లేని వాహనాలను స్వాధీన పరుచుకున్నారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

బెల్లంపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహ్మద్ ఖాసీం బస్తీకి చెందిన చొక్కల సతీష్ చారి అనే వ్యక్తిపై మంగళవారం దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం సంవత్సరం క్రితం తిరుపతికి సతీష్ రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. అప్పు ఇచ్చిన డబ్బులను చెల్లించాలంటూ అడుగుతుండగా ప్రతి సారి వాయిదాలు పెడుతూ వచ్చాడు. ఈక్రమంలో కాంట్రాక్టర్ బస్తీకి చెందిన రౌడీషీటర్ గొర్ల అఖిల్‌ను తిరుపతి ఆశ్రయించాడు. ఈ క్రమంలో సతీష్ ప్రతిరోజులాగానే మెడికల్ స్టోర్‌కు వచ్చి పని చేస్తున్న క్రమంలో రౌడీషీటర్ అఖిల్ బయటకు లాక్కొని వచ్చి బండరాయితో కాళ్లపై, మెడపై మోది దాడికి పాల్పడ్డాడు. స్థానికంగా గమనించినవారు అడ్డుకొని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

శ్రీరాంపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియన వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన శ్రీరాంపూర్ ఏరియాలో జరిగింది. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్‌కే 7 గనికి చెందిన కార్మికులు ఉదయం షిఫ్ట్‌లో విధులకు వెళ్లుండగా, రోడ్డుపై జింక కళేబరం కనిపించింది. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ెటర్నరీ వైద్యులతో పోస్టు మార్టం చేయించి ఖననం చేశారు. ఆర్‌కే 7 గని చుట్టపక్కల అటవీ ప్రాంతంలో గతంలో కూడా తమకు జింకలు కనిపించాయని కార్మికులు తెలిపారు.

నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కాగజ్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫూలాజీ బాబా జయంతిని ఘనంగా నిర్వహించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 30న పూలాజీ బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే కోవ లక్ష్మీతో కలిసి ఈ నెల 30న జైనూర్ మండలం పట్నాపూర్‌లో గల పూలాజీ బాబా సంస్థాన్‌లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, నిర్వహణ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30న పాట్నాపూర్‌లో నిర్వహించే పూలాజీ బాబా జయంతి వేడుకలను అధికారులు, నిర్వహణ కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని తెలిపారు. భక్తులకు, ప్రముఖులకు, వాహన పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వాహనాలు ఒకే వరుసలో వెళ్లే విధంగా పోలీసు శాఖ అధికారులు రూట్ మ్యాప్ తయారు చేసుకోవలని తెలిపారు. రోడ్లపై గుంతల్లో మొరం పోసి చదును చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో పూలాజీ బాబా తనయుడు కేశవరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, విద్యుత్ శాఖ ఈఈ శేషరావు, డీపీఓ భిక్షపతి, డీఎంహెచ్‌వో సీతారాం, మిషన్ భగీరథ ఈఈ సిద్దిక్, సీఐ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పెంఛన్ల పంపిణీ

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు పింఛన్లు పారదర్శకంగా అందజేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి మంగళవారం బ్రాంచి పోస్టు ఆఫీసర్‌లకు మొబైల్స్ అందజేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్‌లో ప్రత్యేకంగా యాప్ ఉంటుందని చెప్పారు. పెన్షన్‌దారులకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుం దన్నారు. ప్రతి నెలా పెన్షన్‌దారులకు ఐరిష్, వేలిముద్ర ద్వారా పెన్షన్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో దత్తారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో నూతనంగా నిర్మించిన అతిథి గృహాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చక్కటి లక్ష్యాలను చిన్నప్పటి నుంచి అలవర్చుకోవాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఇన్‌చార్జి డీఈఓ ఉదయ్ బాబు, ప్రిన్సిపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాగజ్‌నగర్ పెద్దవాగును మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధూకర్, ఎంపీడీవో కోట ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గనిలోకి దిగి..పని స్థలాలను పర్యవేక్షించి..



మాట్లాడుతున్న ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు

మందమర్రిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) వెంకటేశ్వర్లు మంగళవారం మందమర్రి ఏరియాలోని కేకే5 గనిని దిగి పని స్థలాలను పర్యవేక్షించారు. రక్షణకు సంబంధించిన విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. పని స్థలాల్లో ఎస్‌డీఎల్ యంత్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదనపు ఉత్పత్తి సాధించినప్పుడే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట ఏరియా జీఎం దేవేందర్, కేకే 1 గ్రూపు ఏజెంటు రాంబాబు, రక్షనాధికారి భూశంకర్, ఇన్‌చార్జీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేకే ఓసీపీని వెంకటేశ్వర్లు సందర్శించారు. జీఎం దేవేందర్‌ను ఉత్పత్తిపై అడిగి తెలుసుకు న్నారు. వర్షాలకు ఓసీపీలో నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): బొగ్గు రవాణాలో అలసత్వం చూపకుండా సరైన సమయంలో వినియోగదారుల వద్దకు చేర్చాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి, రామగుండం రీజియన్ల రక్షణ జీఎంలో రఘుకుమార్, మధుసూదన్, శ్రీరాంపూర్ ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఓసీపీల పీవోలు ఏవీరెడ్డి, వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవి కుమార్, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, డీజీఎంలు, వివిధ గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగుల రక్షణే ప్రథమమని, ప్రమాద రహిత ఉత్పత్తికి కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్లు అన్నారు. జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్, ఎస్‌వో టూజీఎం విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ అన్నారు. పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రసాయనాలు, వివిధ రకాల రంగులు ఉపయోగించి తయారు చేసే విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితం అవుతుందని చెప్పారు. నీటిలోని జీవరాశులకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతతో భక్తులకు అవగాహన కల్పించేందుకు కొన్ని సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి ఇన్‌చార్జీ బ్రాంచ్ సెక్రటరీ కంది శ్రీనివాస్, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, ఎన్విరాన్‌మెంట్ అధికారి వెంకట్‌రెడ్డి, నాయకులు బానయ్య పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. జీఎం కార్యాలయంతో పాటు నస్పూర్‌కాలనీలోని సేవా భవన్‌లో జరిగిన పంపిణీకి ముఖ్య అతిథులుగా ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, సేవా అధ్యక్షురాలు ఉమారాణి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, డీజీఎం (వర్క్ షాప్) రవీందర్, పర్యావరణ అధికారి హనుమాన్ గౌడ్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న శ్యాంసుందర్

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా జీఎం ఎం.విజయభాస్కర్ రెడ్డి గోలేటి డిస్పెన్సరీలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఎస్ఓటు జీఎం రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై పనిభారం

శ్రీరాంపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఉద్యోగులపై అధిక పనిభారం మోపుతోందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ అన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు యూనియన్‌లో చేరారు. ఉత్పత్తిలో మైనింగ్ ఉద్యోగులే మూలస్తంభాలన్నారు. వారిపై పనిభారం మోపుతూ పదోన్నతులు కల్పించడం లేదని ఆరోపించారు. అనంతరం టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు లోకాటి వెంకటేష్‌కు కండువా కప్పగా ఆయన మాట్లాడారు. జనక్ ప్రసాద్ నాయకత్వంలో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగె స్వామి, తిరుపతి రాజు, జీవన్ జోయల్, బ్రాంచ్ నాయకులు చంద్రమోహన్, రౌతు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

రాజకీయ జోక్యంతో సంస్థకు నష్టం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన రాజకీయ జోక్యంతో సింగరేణి సంస్థకు నష్టం వాటిల్లుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య అన్నారు. బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పీ 3 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత రాష్ట్ర ప్రభుత్వంతో సింగరేణిలో రాజకీయ జోక్యం మొదలైందని, ఇప్పుడు ప్రభుత్వం ఆ విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. సంస్థ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి బొగ్గు బకాయిలు 42 వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందన్నారు. గుర్తింపు సంఘమైన తమపై ఐఎన్‌టీయూసీ ఆరోపణలు చేయడం తగదన్నారు. తాము స్ట్రక్చర్ సమావేశాల్లో సమస్యలను ప్రస్తావించి పరిష్కరిస్తే తామే చేశామని ఐఎన్‌టీయూసీ నాయకులు చెప్పుకోవడం సిగ్గు చేట న్నారు. తాము ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్క టిగా నెరవేరుస్తున్నామని, మిగిలినవి సైతం పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, జీఎం చర్చల కమిటీ సభ్యులు ప్రసాద్ రెడ్డి, సంపత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజినల్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ట్రేడ్‌మెన్ ఇన్‌చార్జి సురేష్, పిట్ కార్యదర్శులు మురళీ చౌదరి, మోతె లచ్చన్న, ఆకుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సీపీఎంఎఫ్ సేవలు

రెబ్బెన, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ డాక్టర్ గోవర్ధన్ అన్నారు. మంగళవారం గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ప్రయాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్ మాట్లాడుతూ సీపీపీఎఫ్ లావాదేవీలు అన్ని సీకేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీపీఎఫ్ రీజినల్ కమిషనర్ డాక్టర్ గోవర్ధన్

సంక్షిప్త సమాచారం

తాండూర్ : తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు తుడుందెబ్బ మండల నాయకులు, రాయి సెంటర్, రాజ్ గోండ్వా, ఆదివాసీ సంఘాల నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 8వ రోజుకుచేరుకున్నాయి.

భీమిని : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో వచ్చేనెల 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సైదం వెంకటేష్ కోరారు.

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల గ్రామంలో ఎర్రగుంట చెరువును మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు.

జన్నారం: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, నాయకులు పాల్గొన్నారు.

జైపూర్ : శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం గనుల్లో మంగళవారం హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 30,31 తేదీల్లో శ్రీరాంపూర్‌లో నిర్వహించే 26వ ద్వైపాక్షిక మహాసభలను విజయవంతం చేయాలన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవా రం ఎంపీడీవో ఉమర్ షరీఫ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వంటశాలన పరిశీ లించి కూరగాయల పరిశుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు.

మందమర్రిరూరల్ : ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. మంగళవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ డ్రమ్ములు, డబ్బులు, కుండీలు, కూలర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు.

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 13 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం వినాయక చవితి సందర్భంగా గొడవలకు పాల్పడిన వారిని గుర్తించి బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మంచిర్యాల కలెక్టరేట్: సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత బాలుర వసతి గృహాన్ని సందర్శించారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నిర్మానుశ్య ప్రదేశంలో పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేసారు. ఈదాడిలో 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4080 నగదుతో పాటు 3సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఏఎస్సై అన్వర్‌తో పాటు పీసీలు రాజమౌళి, సత్యనారాయణ, సుధాకర్, లక్ష్మన్ ఉన్నారు.

రేషన్ సంబురం



- కొత్త కార్డులకూ వచ్చే నెల నుంచి సరుకులు
- కొత్తగా 24,543 కుటుంబాలకు లబ్ధి
- పాత కార్డుల్లో 54,180 అదనపు పేర్ల నమోదు
- ఆనందంలో లబ్ధిదారులు

నెన్నెల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆహార భద్రత కార్డుదారులకు వచ్చే నెల నుంచే సరుకులు అందనున్నాయి. ఈ పాటికే గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యేల చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేశారు. పాత వారితో పాటు కొత్తగా కార్డులు పొందిన కుటుంబాలకు కూడా నెల వారి రేషన్ కోటా విడుదలైంది. గోదాంల నుంచి రేషన్ షాపులకు బియ్యం స్టాక్ చేరుతోంది. పాత కార్డుదారులకు జూన్ నెలలోనే మూడు నెలల కోటా కిందా ఒకే సారి బియ్యం పంపిణీ చేశారు. అప్పటి నుంచి కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ బియ్యం మాత్రం పోయలేదు.

మూడు నెలల కోటా గడువు ముగియడంతో తాజాగా పాత కార్డుదారులతో పాటు కొత్త లబ్ధిదారులకు కూడా సెప్టెంబరు కోటా కేటాయించారు. వచ్చే నెల 1 నుంచి 15 వరకు నెలవారి కోటాను పంపిణీ చేయ నున్నారు. కార్డు పొందినవారికి ఆహారభద్రతతో పాటు ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, వంటగ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లకు అర్హత లభించనుంది. యేళ్ల తరబడి ఎదురు చూసిన వారికి రేషన్ కార్డు మంజూరై సరుకులు అందనుండటంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంచి ఫ్రీ

కార్డుదారులకు ఉచితంగా బియ్యంతో పాటు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పర్యావరణహితమైన సంచులను సైతం అందించాలని నిర్ణయించారు. తెల్లటి బ్యాగ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఫోటోలతోపాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభయహస్తం ఆరు గ్యారెంటీల పథకాల వివరాలు ముద్రించారు. రూ. 50 విలువ చేసే ఈ సంచిని బియ్యంతో పాటు ఉచితంగా అందజేయనున్నారు. ఈ బ్యాగులు సైతం జిల్లాకు చేరాయి.

24,543 కొత్త రేషన్ కార్డులు

జిల్లాలో 423 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో 2,20,543 మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. 24,543 మంది కొత్తగా రేషన్ కార్డులు పొదారు. పాత కార్డుల్లో 54,180 మందిని కొత్తగా చేర్చారు. ప్రతి కార్డులోని ఒక వ్యక్తికి ఆరు కేజీల సన్న బియ్యం చొప్పున పంపిణీ చేయనున్నారు. వీరందరికి జిల్లాలోని 423 రేషన్ దుకాణాల ద్వారా సెప్టెంబర్ నుంచి సరుకులు పంపిణీ చేయనున్నారు. గతంలో 4,352 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసేవారు. పెరిగిన లబ్దిదారులకు అనుగునంగా 4,693 మెట్రిక్ టన్నులు కేటాయించారు. జిల్లాలోని లబ్దిదారులదరికి సన్న బియ్యం సరఫరా చేస్తామని అధికారులు పేర్కొన్నారు.



నెన్నెలలో లబ్దిదారులకు అహార భద్రత కార్డు మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ (ఫైల్)

ఆది దేవుడి ఆగమనం..

(5వ పేజీ తరువాయి)

ఉంటాయని చెబుతారు. పుష్పం పత్రం, ఫలంతోయం అంటూ అదిదేవుడైనా గణ పతికి తొలిపూజలు అందిస్తారు. వినాయక అష్టోత్తర శతనామాలు చదువుతూ స్వామికి పత్రాలు, పూలతో పూజా చేయాలి. దీపం, నైవేద్యం తాంబూలం, నీరాజనం, మంత్రపుష్పం, ప్రదక్షిణం చేసిన అనంతరం పంచామృతాలు, కొబ్బరి నీళ్ల కలిపిన తీర్థం తీసుకోవాలి.

● మట్టి విగ్రహాలే మేలు...

గణపతి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ హితంగా మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పూజించడానికి భక్తులు మొగ్గు చూపుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసి పీఓపీ విగ్రహాలు నీటిని కలుషితం చేసి హాని కలిగిస్తాయి. పీఓపీ తయారు చేసిన విగ్రహాలు నీటిలో కరుగడానికి చాలా సమయం పడుతోంది. అదే మట్టితో తయారు చేసిన విగ్రహం తక్కువ సమయంలో నీటిలో కరిగిపోతుంది. నస్పూర్ పట్టణంలోని పటేల్ కాలనీలో గణేష్ బొమ్మల పరిశ్రమలో గణపతి మట్టి విగ్రహాలను సహజ సిద్ధమైన రంగులతో తయారు చేస్తున్నారు. ఎనిమిది ఇంచుల మట్టి విగ్రహం రూ. 30 రూపాయలకు, 7ఫీట్ల మట్టి విగ్రహం రూ. 14వేల నుంచి 15వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి.

● మార్కెట్లో సందడి..

దండేపల్లి : బుధవారం వినాయక చవితి సందర్భంగా మార్కెట్లో సందడి నెలకొంది. రెండు రోజుల ముందు నుంచే వినాయక ప్రతిమలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు భక్తులు. వ్యాపారులు రకరకాల వినాయకులను సిద్ధంగా ఉంచారు. రూ. 1500 వందల నుంచి 30 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. దీంతో మార్కెట్లో వినాయకుల అమ్మకాలు ఊపందుకున్నాయి.

ర్యాగింగ్‌పై అవగాహన

నస్పూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగిరేణి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు ఎస్ఐ ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అదే విధంగా గంజాయి లాంటివి మత్తును సేవించి ఇబ్బందులకు గురి కావద్దన్నారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో ఎవరైన ర్యాగింగ్‌కు పాల్పడిన, గంజాయి సరఫరా చేసిన, సేవించిన కూడా 100 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు కళాశాల అధ్యపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి..

దండేపల్లి ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే గొప్పస్థాయికి చేసుకోవచ్చునని, ఆదిశగా ప్రతి విద్యార్థి బాగా చదువుకోని ఉన్నత స్థాయికి చేరుకోవాలని దండేపల్లి ఎస్సై తాహసీనోద్దీన్, ఎంఈవో దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులందరికీ మంగళవారం ఖమ్మం జిల్లా చెందిన షేర్ ది విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నారాయణరావుతో కలిసి రూ లక్ష విలువ గల స్కూల్ కిట్స్ విద్య సామగ్రిని వారి చేతుల మీదిగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడిని పాఠశాల ఉపాధ్యాయ బృందం పూర్వ విద్యార్థులు శాలువతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో గుమ్మడి పాండేషన్ వ్యవస్థాపకులు గుమ్మడి డాక్టర్ కిరణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాసామాగ్రికి అందజేస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్

నెన్నెల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. సీహెచ్‌వో సత్తయ్యతో కలిసి మంగళవారం ఆయన నెన్నెల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై సలహాలు, సూచనలిచ్చారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు వెంటనే పీహెచ్‌సీకి సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లు మెరుగుపరచాలన్నారు. సిబ్బంది హాజరు, ఔట్ పేషంట్లు, మందుల స్టాక్ వివరాల గూర్చి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు.

కార్మికుల హక్కులు, సంక్షేమానికి కృషి చేస్తాం



దేవాపూర్ గేటుమీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

కాసిపేట,ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామకరంగం ఏదైన కార్మిక హక్కులు కాపాడుతూ వారి సంక్షేమానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం దేవాపూర్‌లో లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నిర్వహించిన గేటుమీటింగ్ అథితి హాజరై మాట్లాడారు. ఓరియంట్ ఎన్నికల్లో తమ అభ్యర్థిగా స్థానికుడు పుస్కూరి విక్రమ్‌రావును నిలబెట్టామన్నారు. ఓటర్లు విక్రమ్‌రావును అత్యధికమెజార్టీతో గెలిపించాలని కోరారు. యూనియన్ అభ్యర్థి పుస్కూరి విక్రమ్‌రావు మాట్లాడుతూ ఓరియంట్ కార్మికులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు విద్యా, ఓరియంట్ ప్రభావిత గ్రామాల అభివృద్ధి స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో సభ అధ్యక్షులుగా అడె జంగుసోయం సూరు, సూరిబాబు, రత్నం ప్రదీప్, బండి సదానందం, తిరుపతిరెడ్డి, అట్టెం శ్రీనివాస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన

మందమర్రిరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పర్యటించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలన్నారు. ప్రతి రోజు పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలన్నారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి విద్యాలత తదితరులు పాల్గొన్నారు.

మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

లక్సెట్టిపేట, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మార్కులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని లక్సెట్టిపేట ఎంఈవో శైలజ హెచ్ఎంకు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలతో పాటు వివిధ పాఠశాలల ప్రదానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు సంభందిత పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈకార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రదానోపాధ్యాయులు కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

పోలీసు కేంద్రం పరిశీలన

కాసిపేట, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో జరుగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాన్ని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని ఏర్పాట్లను శాంతిభద్రతల పరిరక్షణ, ఓటర్లు వచ్చేందుకు రూటు మ్యాప్‌ను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన పోలీసు భద్రత చర్యలపై సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ గంగారాం, కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు, ఓరియంట్ కంపెనీ అధికారులు తిరుపతి, సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జైపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జైపూర్ గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాల, నీటి ట్యాంకులను తనిఖీ చేశారు. మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ఆహారం వండే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, కేజీబీవీ ఎస్‌వో ఫణిబాల, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్యదర్శుల టర్మినేషన్ ఉపసహరించుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లాలో టర్మినేషన్, సస్పెండ్ అయిన పంచాయతీ కార్యదర్శులను, చార్జెస్‌లను వెనక్కి తీసుకోవాలని కోరుతూ జిల్లా టీఎన్‌జీవో అధ్యక్షుడు, జిల్లా జేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. రెండేళ్ల నుంచి సర్పంచులు లేకపోయినా నిధులకు రాకపోయినా పారిశుధ్యపనులు, వీధి దీపాలు, ఇతర పనులను జేబుల నుంచి పెట్టుకుని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శుల టర్మినేషన్ ఉపసంహారించుకోవాలన్నారు.

చదువుతోనే జీవన నైపుణ్యాలు మెరుగుపడతాయి

కాసిపేట, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): చదువు వల్ల ప్రతి ఒక్కరి జీవితంలో జీవన నైపుణ్యాలు మెరుగుపడుతాయని ఎంఈవో వెంకటేశ్వర స్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన నవభారత్ సాక్షరత శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అక్షరాస్యతలో కాపేపేట మండలాన్ని వందశాతం అక్షరాస్యత సాధించడానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఉల్లాస్ ద్వారా ప్రాథమిక అక్షరాస్యత, కీలకమైన జీవన నైపుణ్యాలు ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాలు నిరంతర విద్యను పొందవచ్చునన్నారు. అందరూ చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ బండ శాంఖారి, కిరణ్, అన్నపూర్ణ, ఏపీఎం రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి

నెన్నెల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యమని ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై అన్నారు. మండల కేంద్రంలో మంగరళవారం ఉల్లాస్ (నవభారత అక్షరాస్యతర కార్యక్రమం)పై హెచ్ఎంలు, సీఏలు, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. 2027 నాటికి వందశాతం అక్షరాశ్యతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం మధుమోహన్, ఏపీఎం త్రయంబకేశ్వర్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రాజీవ్‌నగర్ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద పురుగుల మందు ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రెబ్బెన మండలానికి చెదిన అజ్మీర సుఖేందర్(27) హైదరాబాద్ ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. 15రోజుల క్రితం భార్యభర్తలకు గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సుఖేందర్ సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు వచ్చి రాజీవ్‌నగర్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

లక్సెట్టిపేట, ఆగస్టు,26 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని గోదావరి వద్ద నిమర్జన ఏర్పాట్లను మంగళవారం లక్సెట్టిపేట సీఐ రమణమూర్తితో తహసీల్దార్ దిలీప్ కుమార్ పరిశీలించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏలాంటి ప్రమాదాలకు తానివ్వకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని సంబందిత అధికారులను ఆదేశాలు జారీ చేసారు. ముఖ్యంగా గోదావరి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున నిమర్జనంకు వచ్చే భక్తులు గోదావరిలోకి వెల్లకుండా చూసుకోవాలని గోదావరి వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులకు తెలుపుతూ పలు సలహాలు సూచనలు అందించారు. ఈకార్యక్రమంలో సీఐ, ఎమ్మార్వో వెంట మున్సిపల్ కమీషనర్ విజయ్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ కల్లెడ రాజశేఖర్, ఎస్సైలు గోపతి సురేష్, తహసీయోద్దీన్ తదితరులు ఉన్నారు.

ఓరియంట్‌లో కార్మికుల మెరుపు సమ్మె

విధులు బహిష్కరించిన లోడింగ్ కార్మికులు

కాసిపేట, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్(అదాని) సిమెంట్ కంపెనీలో మంగళవారం సాయంత్రం లోడింగ్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. మంగళవారం రెండవ షిఫ్ట్‌లోని కార్మికులు విధులు బహిష్కరించి కంపెనీ గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఓరియంట్ కంపెనీ నుంచి అదాని కార్పొరేట్ సంస్థ చేతిలో మారడంతో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. 25రోజులకు వేతన స్లిప్‌లను తయారు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అలాగే లోడింగ్‌లో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి పర్మినెంట్ కార్మికులుగా పరిగణించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులతో స్థానిక బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా కార్మికులు ఒప్పుకోలేదు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రను ఏర్పాటు చేశారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

మట్టి గణపతులను పూజిద్దాం..

బెల్లంపల్లి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మట్టి వినాయక విగ్రహా పంపిణీ చేశారు.

దండేపల్లి: గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానంలో భక్తులకు మట్టి వినాయకులను అందజేశారు. ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, ఈవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

●దండేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలోని మంగళవారం ఈసీవో క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మంచిర్యాల పట్టణం కాలేజీరోడ్డులో శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా వినాయక చౌతి వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, డీన్ రవి పాల్గొన్నారు.

కాసిపేట: కాసిపేట మోడల్ స్కూల్, ధర్మరావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మట్టి గణపతుల పూజలు నిర్వహించారు.

శ్రీరాంపూర్ : ప్రజలు మట్టి వినాయకులను పూజించాలని పర్యావరణ వేత్త, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రాష్ట్ర వాల్టా చట్టం కమిటీ సభ్యుడు గుండేటి యోగేశ్వర్ అన్నారు. ఆర్కే 7 గని కార్మికుడు రాజ్‌కుమార్ ఆయనను మంచిర్యాలలో కలిసి మట్టి విగ్రహం అందించారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని రాఘవేంద్ర కృష్ణవేణి విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మట్టితో గణనాథులను తయారు చేశారు. ప్రిన్సిపల్ అనీల్ కుమార్, అకాడమిక్ అడ్మినిస్ట్రేషన్ శిల్ప పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామంలో గల వివేకానంద పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. కరస్పాండెంట్ సతీష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన నలుగురు ముస్లిం విద్యార్థినులు మట్టి గణపతులను తయారు చేసి ఔరా అనిపించారు.



శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు చవితి వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది

తాండూర్ : మండల కేంద్రంలో మంగళవారం లయన్స్‌క్లబ్ సభ్యులు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరు పట్టణంలో 60 ఏళ్ల నుంచి విశ్వ బ్రహ్మణులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. 1958 నుంచి ఆకెనపల్లి నానయ్య మట్టి గణపతులను తయారు చేస్తున్నాడు. అప్పటి నుంచి నేటి వరకు మట్టి గణపతిని పూజించడం ఆనవాయితీగా వస్తుందని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు.










లక్సెట్టిపేటలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు.. కోటపల్లిలో మట్టి విగ్రహాలతో ముస్లిం విద్యార్థినులు.. బెల్లంపల్లిలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్.. మట్టి గణపతులు తయారు చేస్తున్న నానయ్య

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 27 ఆగస్టు 2025



ఐటీఐలో ప్రవేశానికి గడువు పెంపు

శ్రీరాంపూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐ, ఏటీసీలో ప్రవేశానికి గడువు పెంచినట్లు శ్రీరాంపూర్ ఐటీఐ ప్రిన్సిపాల్ టి. సుజాత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి రెండవ విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మూడో విడత(వాక్-ఇన్-అడ్మిషన్) స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉండగా, దానిని ఈ నెల 30వ తేదీ వరకు పొడిగిస్తూ కమీషనర్ ఆఫ్ ఎంప్లాయీమెంట్ అండ్ ట్రైనింగ్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులో 8 సీట్లు, డ్రాఫ్ట్మెన్ సివిల్ కోర్సులో 11 సీట్లు, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ కోర్సులో 6 సీట్లు, వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్ ఆఫ్ ఎఫ్ఈఎం కోర్సులో 16 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ ఫారం ప్రింట్, ఒరిజనల్ సర్టిఫికెట్లతో శ్రీరాంపూర్‌లోని ఐటీఐలో హాజరు కావాలని కోరారు.

ఫుడ్ ఫెస్టివల్

మంచిర్యాల క్రైం, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రాజీవ్ నగర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఘనంగా ఫుడ్‌ఫెస్టివెల్ కార్యక్రమం నిర్వహించారు. వంటకాలు తయారు చేసి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫుడ్ స్టాల్స్ ద్వారా ఆహార సంస్కృతి ఆరోగ్యకరమైన భోజనంపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. ఫుడ్‌ఫెస్టివెల్ ద్వారా సృజనాత్మకత, సంస్కృతి పట్ల గౌరవం పెంపొందుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చన్న అన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేద్దాం

దండేపల్లి ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనకు మనం కృషి చేద్దామని దండేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. దండేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలం గూడెంలో మంగళవారం టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు క్షయ వ్యాధి నివారణ కోసం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ సుదాకర్‌నాయక్, సీహెచ్‌వో రాజిరెడ్డి, సూపర్ వైజర్ల శాంతికుమారి, టీబీ సూపర్ వైజర్ల సురేష్, ఎంఎల్‌హెచ్‌పీలు మనీషా, రాధిక, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఆశ కార్యకర్త వరలక్ష్మి, సత్య, రాధలు పాల్గొన్నారు.

ఆది దేవుడి ఆగమనం

ఊరూవాడ గణపతి సంబరాలు...
నేడు వినాయక చవితి
వాడవాడలా వెలిసిన మండపాలు



నస్పూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గణేశచతుర్థి అంటేనే పిల్లలకు అత్యంత ఇష్టమైన పండుగ. బొజ్జ గణపయ్య తయారీ నుంచి అలంకారం, పూజ, నైవేద్యాలు, ఇలా ప్రతి ఒక్క దాంట్లో ఎంతో ఇష్టంగా పాల్గొంటారు. ఎంతో భక్తిశ్రద్ధలతో నవరాత్రులను జరుపుకుంటారు.

ఆదిదేవతల్లో తొలి పూజలందుకునే గౌరీసుతుడి రూపం వ్యక్తిత్వ వికాసానికి పాఠం. ఆయనకు చేసే పూజలు జీవ వైవిధ్యానికే ప్రతీకగా నిలుస్తాయి. రంగుల విగ్రహాల కారణంగా నీటి కాలుష్యం ఎక్కువ అవుతున్నందున ఇళ్లలో మట్టి విగ్రహాలను పూజించాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. విఘ్నేశ్వరుడు ప్రకృతి ప్రియుడు కావడం వలన ఆయన పూజా విధానంలో కూడా పత్రాలను, నైవేద్యాలను ఆకులతో ఆరాధించే పండగా వినాయక చవితి ఒక్కటే. ఈ నెల 27 బుధవారం వినాయక చవితి సందర్భంగా జిల్లాలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

21 రకాల పత్రులతో పూజలు..

వినాయకుడిని ఆరాధిచండమంటేనే ప్రకృతిని పూజించడమని భావిస్తారు. పూజలో వినియోగించే మట్టి నుంచి పసుపు, ఆకులు అణువణువునా ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. ప్రకృతిలో లభించే 21 రకాల పత్రిలో ఎన్నో ఔషధగుణాలు దాగి ఉన్నట్లు గుర్తించారు. గణపతికి ఇష్టమైన గరకను పూజలో ఖచ్చితంగా వినియోగిస్తారు. ఉమెత్త ఆకు, దర్భ, రేగు ఆకు, ఉత్తరేణి, జిల్లేడు, సీతాఫలం, జమ్మి ఆకు, తెల్ల మద్ది ఆకు, మారేడు, బిల్వా, మరువక ఆకులు, వర్షాకాలంలోనే లభించే వీటి వలన ఈ సీజన్‌లో వ్యాప్తి చెందే ఆరోగ్య సమస్యలకు ఎంతో ఉపయోగకరంగా..

మిగతా 7లో

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కలెక్టర్ కుమార్ దీపక్



చెన్నూరు ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీ

చెన్నూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమలో భాగంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, రిజిష్టర్‌లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మురళీ కృష్ణతో కలిసి పట్టణంలో అమృత్ 2.0లో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు.

అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం కేజీబీవీ విద్యాలయం పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తరగతిగదులు, వంటశాల, పరిస రాలను పరిశీలించారు. పాఠశాలలో పాడైన ఆర్‌వో ప్లాంటు స్థానంలో కొత్తగా ఏర్పాటు చేయాలని అధి కారులను ఆదేశించారు. అరంతంర ఇంటర్మీడియట్ ఎంపీసీ విద్యార్థులకు, 10వ తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ కమిటీ ఎన్నిక



దరణికోట వేణుగోపాల్



సూరినేని గంగాధర్

మంచిర్యాలక్రైం, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంచిర్యాల లయన్స్ భవన్‌లో జిల్లాలోని అన్ని మండలాల, అధ్యక్షప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు సభ్యులతో సర్వసభ్య సమావేశం నిరహించారు. 2025-27 సంవత్సరానికి కార్యవర్గం ఎన్నికలు, ఎన్నికల అధికారి రాష్ట్ర, శిక్షణ కమిటీ ఉపాధ్యక్షులు వీర శంకర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను మళ్లీ రెండు సంవత్సరాలు వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మానం చేశారు. ఈసందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, సూరినేని గంగాధర్ మాట్లాడుతూ జిల్లాలోని పీఆర్టీయూ బలోపేతానికి కృషి చేస్తానని ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాడుతానని అన్నారు. జిల్లా విద్యాశాఖ విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వర్‌రెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ బి. శ్రీనివాస్, కొత్త సురేశ్, రామకృష్ణ, రాజేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి



బంకమట్టితో, టీఎన్‌జీవో సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలను పూజించి కాలుష్యాన్ని నివారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో టీఎన్‌జీవో హౌజింగ్ బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక మండలి ఆధ్వర్యంలో పర్యావరణహితమైన బంక మట్టి వినాయకున్ని అందించి మట్టి వినాయకుని గోడ ప్రతులను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రసాయనాలు, రంగులు ఉపయోగించిన విగ్రహాల వల్ల నీటి కాలుష్యం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలి ప్రతినిధులు గడియారం శ్రీహరి, గుండేటి యోగేశ్వర్, భూముల రామ్మోహన్, మొండయ్యమ ల్లయ్య, బాబురావు పాల్గొన్నారు.

విద్యపై ఆసక్తికి బోధనోపకరణాలు దోహదం

సబ్‌కలెక్టర్ మనోజ్



మేళాను ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ మనోజ్

బెల్లంపల్లి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యపై ఆసక్తికి బోధనోపకరణాలు ఎంతగానో దోహదపడుతాయని బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్ అన్నారు. మంగళవారం బోధనోపకరణాల మేళా ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధనోపకరణాల ప్రదర్శనపై ప్రతిభ కనబరిచారన్నారు. అనంతరం బోధనోపకరణాలు ఏర్పాటు చేసిన అభ్యసన సామగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ మూర్తి, ఉమ్మడి పరీక్షల విభాగ కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, ఎంఈవో పోచయ్య, పాల్గొన్నారు.

రెండో రోజు బాధితుల నిరసన

చెన్నూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్‌బీఐ 2 బ్యాంకులో రెండో రోజైన మంగళవారం బాధితులు బ్యాంకుకు చేరుకుని నిరసన తెలిపారు. తనఖా పెట్టిన బంగారాన్ని ఎప్పుడు ఇస్తారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తనాఖా పెట్టిన కౌంటర్ రశీదులను బ్యాంకు అధికారులకు బాధితులు సమర్పించారు. అధికారులు బ్యాంకులో హెల్ప్‌లైన్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. బాధితులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జరిగిన స్కామ్‌పై విచారణ కొనసాగుతుందని, విచారణ అనంతరం బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితులకు న్యాయం చేస్తామన్నారు. బాధితులు సంయమనం పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. బ్యాంకులో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ దేవేందర్‌రావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వంద శాతం అక్షరాస్యత సాధించాలి

కోటపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐకేపీ సంఘాల సభ్యులు, నిరక్షరాస్యులు వంద శాతం అక్షరాస్యత సాధించాలని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నవ భారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ నుంచి ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఒక వీవోఏకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఒక్కరు అక్షరాస్యులు కావాలన్న ఉద్దేశ్యంతోనే నవ భారత్ సాక్షరత కార్యక్రమం అమలులోకి వచ్చిందని, శిక్షణార్థులు ప్రతి గ్రామపంచాయతీలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈవో సీహెచ్ మొగిలి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చార్వాక హాలులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్ స్కాలర్‌సిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, సన్నిగౌడ్, సుమంత్, సిద్దార్థ, గణేష్, శ్రావణ్, శ్రీనివాస్, రోహిత్, సాయికిరణ్ పాల్గొన్నారు.

ముందస్తు వినాయక చవితి వేడుకలు



వినాయకుడి ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. జిల్లా కేంద్రంలోని అభ్యాస పాఠశాలలో 70 మంది విద్యార్థులు వినాయకుని ఆ కారంలో కూర్చుని అబ్బుర పరిచారు.

పాఠశాల ఆవరణను తోరణా లతో అలంకరించారు. గణపతి నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాన సుధతి, గిరీష్‌కుమార్, వెంకటేశ్వర్ రావు, రోహిణి, సమత పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలు

మందమర్రిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి పటణంలో ఈ నెల 31న తెలంగాణ రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే ఛాపియన్ పోటీలు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి రవి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ కుంగ్‌ఫూ కరాటే క్రీడలకు విదేశాల్లో మంచి పేరుందన్నారు. ప్రతి సంవత్సరం ఆనావాయితీగా తాము పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు దాదాఉ 500 మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశాలున్నాయన్నారు. పాల్గొనే వారికి అన్ని రకాల సౌకర్యాలు, భోజనం ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ పోటీలకు మందమర్రి జీఎం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈ సమావేశంలో నాయకులు రంగు శ్రీనివాస్, కృష్ణ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

లక్సెట్టిపేట, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కూకట్‌పల్లిలో న్యాయవాది శ్రీకాంత్‌పై దాడికి నిరసనగా లక్సెట్టిపేట పట్టణ న్యాయస్థానంలో న్యాయవా దులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేసారు. బార్ అసోసియేషన్ అ ధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న మాట్లాడుతూ న్యాయవాదులకు రోజు రోజుకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులకు ప్రత్యేకంగా రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు నళినికాంత్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్, సత్య నారాయణ, తిరుపతి స్వామి, రవీందర్, సదాశివ, న్యాయవాదులు ప్రకాశం, పద్మ, సజని పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: మంచిర్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కూకట్‌పల్లి హైదరాబాద్ కోర్టు బార్ అసోసియషన్ ఈసీ మెంబర్ న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై ప్రతి వాదులు దాడి చేసి తీవ్ర గాయపరిచినందుకు నిరసనగా తెలంగాణ ఫెడరేషన్, బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులు బహిష్కరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భుజంగ రావు, రంజిత్‌గౌడ్, పులి రాజమల్లు పాల్గొన్నారు.